క్లుప్తంగా

మాతా-శిశు మరణాల కట్టడికి సమష్టి కృషి



అధికారులతో సమీక్షిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మాతా-శిశుమరణాల కట్టడికి సమష్టిగా కృషి చేయాలని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉషశ్రీ ఆదేశించారు. చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం మాతా-శిశుమరణాల టాస్క్‌ఫోర్స్ కమిటీ సమీక్షించింది. జిల్లాలో మాతా-శిశుమరణాలకు కట్టడికి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, గర్భిణుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ, మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. సకాలంలో ప్రసవానికి వారు ఆస్పత్రిలో చేరేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు లత, ప్రశాంతి, సునంద, సింధూర, పద్మజారాణి, షారుక్, సాయి కిరణ్, రోజారాణి, శ్యామ్ సుగుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కంటి ఆపరేషన్లకు 20మంది ఎంపిక



రోగులను పరీక్షిస్తున్న వైద్య నిపుణులు

బంగారుపాళెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 40 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి వారిలో 20 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించినట్టు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. వారిని చెన్నైకి తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించి, మందులు, కళ్లద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

గర్భవతులు ఆసుపత్రిలోనే ప్రసవించాలి



గర్భవతులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గర్భవతులు ఆసుపత్రిలోనే ప్రసవించాలని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక కోరారు. సోమవారం మండలంలోని పల్లెచెరువులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులను పరీక్షించి మందులు పంపిణీ చేసి ఆమె మాట్లాడారు. గర్భవతులు ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ప్రజలు వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే, గోవిందరెడ్డిపల్లెలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు రోగులను పరీక్షించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగులతో రక్తహీనత



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్

గుడిపాల: నులి పురుగుల మూలాన చిన్నారుల్లో రక్తహీనత సమస్య తలెత్తుతుందని, దీని నివారణకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించాలని గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారి చంద్ర మహేష్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆయన తమ సిబ్బందితో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 12న మండలంలో 1 నుంచి 2 ఏళ్లలోపు పిల్లలకు అల్బెండజోల్ 200 ఎంజీ, 2 నుంచి 19 ఏళ్లలోపు వారికి 400 ఎంజీ మాత్రలను మింగించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు దీనికి సహకరించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సుధాకర్

తవణంపల్లె: రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి, స్థానిక తహసీల్దార్ సుధాకర్ తెలిపారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో సోమవారం తహసీల్దార్ సుధాకర్‌ను ఆయన కార్యాలయంలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, సిబ్బంది సత్కరించి అభినందించారు. రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తానని, అలాగే వచ్చే నెల రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తామని ఆయన చెప్పారు.

అందమే ఆనందం..!

అతివల అందాలకు మరింత వన్నె తెచ్చేవి చీరలు, బ్లౌజ్‌లు అనేది ఒకప్పటి మాట. ఇప్పుడు ఆ చీరలు, బ్లౌజ్‌లకు కొత్తగా అందాలు తీర్చిదిద్దుతున్నది మగ్గం, కంప్యూటర్ ఎంబ్రాయిడరింగ్ వర్క్. ఒకప్పుడు పెద్ద నగరాలకు మాత్రమే పరిమితమైన మగ్గం, కంప్యూటర్ ఎంబ్రాయిడరీ ప్రస్తుతం చిన్న పట్టణాలకు సైతం విస్తరించింది. అంతేకాకుండా ఎప్పటికప్పుడు సరికొత్త డిజైన్లు సైతం మార్కెట్‌ను ముంచెత్తుండడంతో వీటిపై మహిళలు ఆసక్తి చూపుతున్నారు.

- మదిని దోచే మగ్గం వర్క్ డిజైన్లు
- కాలానుగుణంగా సరికొత్త వస్త్రాలు
- కంప్యూటర్ ఎంబ్రాయిడరీపై మొగ్గు
- మగ్గం పనులతో మహిళల ఉపాధి



కంప్యూటర్ ఎంబ్రాయిడరీ వేస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరులో ఒకప్పుడు మగ్గం వేసే వ్యక్తులు అతి తక్కువ. అది కూడా కోల్‌కత్తా, రాజస్థాన్ చెందిన వారే మగ్గం వేసేవారు. ఇక స్థానికంగా ఉన్న మహిళలు అతి తక్కువ సంఖ్యలో మగ్గంలో పనుల్లో ఉన్నారు. ఇలా చిత్తూరు నగర వ్యాప్తంగా 500మంది ఉండొచ్చని ఒక అంచనా. మగ్గం డిజైన్లను చేతితో వేసి ఆదాయం గడించేవారు. ఒక్కో డిజైన్‌కు రూ. 1000 నుంచి రూ. 30వేల వరకు తీసుకునేవారు. ఒక్క డిజైన్ వేయాలంటే చేతితో 2 నుంచి 4 రోజుల సమయం పట్టేది. అయితే మగ్గం మెషిన్ల రాకతో డిజైన్ల రూపకల్పనలో వేగం, నవ్యత పెరిగింది.

కంప్యూటర్ ఎంబ్రాయిడరింగ్....

పండుగలు, ఫంక్షన్లకు ఆకట్టుకునే వస్త్రధారణతో వెళ్లడం మహిళలకు బాగా ఇష్టం. మంచాలపై చేతితో తయారు చేసే వివిధ రకాల డిజైన్లతో పాటు కంప్యూటరీ ఎంబ్రాయిడరీ అందుబాటులోకి వచ్చాయి. సుందరయ్యవీధి, కొంగారెడ్డిపల్లె, సుబేదారు వీధి, రాములుగుడివీధి, మిట్టూరు, గిరింపేట తదితర ప్రాంతాల్లో ఎంబ్రాయిడరీ మెషిన్లతో పలు రకాల డిజైన్లు సులువుగా వేస్తున్నారు. ఒక్కో డిజైన్‌కు 3 నుంచి 5 గంటల సమయం తీసుకుంటున్నారు. చిత్తూరులో దీనికి మంచి డిమాండ్ ఉంటోంది. ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. ముఖ్యంగా పెళ్లిళ్ల సమయంలో చేతినిండా పనితో ఉంటున్నారు. రూ.300 నుంచి వేల రూపాయలకు పైగా డిజైన్లు తాము ధరించే వస్త్రాలపై వేయించుకునే డిజైన్లకు వేల రూపాయలు ఖర్చు చేయడానికి కూడా మహిళలు వెనుకాడడం లేదు. రూ.300 నుంచి 5వేలకు పైగా విలువ చేసే డిజైన్లు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి.

బ్లౌజ్ డిజైన్లకు ఫుల్ డిమాండ్

పట్టు చీరలకు కుచ్చులు వేయించుకోవడంతో పాటు వాటిపై వేసుకునే బ్లౌజ్‌లకు మరిన్ని అందాలు ఉట్టిపడేలా డిజైన్లు వేయించుకుంటున్నారు మహిళలు. బ్లౌజ్ వెనుకవైపు, చేతులపై వివిధ రకాల డిజైన్లు వేయించుకునేందుకు మహిళలు అమితంగా ఇష్టపడుతున్నారు. ఫలితంగా మగ్గంతో పాటు కంప్యూటర్ ఎంబ్రాయిడింగ్ వర్క్‌కు డిమాండ్ పెరిగింది. వీటిలో బోటెనెక్, ఆల్ అవర్, క్లచ్ వర్క్, మిరర్, కుచ్చులు.. ఇలా పలురకాల డిజైన్లు వేయించుకునేందుకు మహిళలు ఉత్సాహం చూపుతున్నారు. చీరలతో పాటు చిన్నపిల్లల లంగాలు, పలు రకాల వస్త్రాలపై డిజైన్లు వేయించుకునే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

టైలరింగ్ చేస్తూ..ఎంబ్రాయిడరింగ్...



నేను టైలరింగ్ పని చేస్తున్నారు. దీంతో ఎంబ్రాయిడరింగ్ డిజైన్ నేర్చుకోవాలని ఎప్పటి నుంచో ఇష్టం. మూడేళ్లకు క్రితం కంప్యూటర్‌తో ఎంబ్రాయిడరింగ్ వేసే మెషిన్ వచ్చింది. కూడబెట్టుకున్న డబ్బుతో మెషిన్ కొన్నా. ఇప్పుడు టైలరింగ్ కంటే ఈ ఎంబ్రాయిడరింగ్ డిజైన్ వేయించుకునేందుకే ఎక్కువగా వస్తున్నారు. రోజూ మూడు నుంచి నాలుగు ఆర్డర్లు వస్తున్నాయి.

-సాయికుమారి, చిత్తూరు

నచ్చిన డిజైన్ వేస్తాం



ఎంబ్రాయిడర్ మెషిన్ తెచ్చుకుని మూడు నెలల నుంచి వర్క్ చేస్తున్నా. బ్లౌజ్‌లపై డిజైన్లు వేస్తూ సంపాదిస్తున్నా. మహిళలు మెషిన్లపై డిజైన్లు వేయించుకునేందుకు ఇష్టపడుతున్నారు. ఎవరికి ఎలాంటి డిజైన్ కావాలన్నా వేసేందుకు కంప్యూటర్‌లో కొత్త డిజైన్లు తెప్పిస్తున్నాం. మా దగ్గర 4వేల డిజైన్లు ఉన్నాయి. కొత్త డిజైన్లు ఉన్న వాటిని ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయిస్తున్నాం. లేకుంటే వాళ్లు తెచ్చుకున్న డిజైన్లు కూడా వేయిస్తున్నాం.

-అనూషరాణి, సుందరయ్యవీధి, చిత్తూరు

13న మరుదు సోదరుల విగ్రహావిష్కరణ

- మొదలియార్ సంక్షేమ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బుల్లెట్ సురేష్



సమావేశంలో మాట్లాడుతున్న బుల్లెట్ సురేష్

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : స్వాతంత్య్ర సమర యోధులు, స్నేహం కోసం తమ ప్రాణాలను బ్రిటిష్ వాకి తృణప్రాయంగా అర్పించిన మరుదు పాండియార్ సోదరుల విగ్రహాల ఆవిష్కరణకు పూనుకోవడం తన పూర్వజన్మ సుకృతమని శ్రీనివాస చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, రాష్ట్ర మొదలియార్ సంక్షేమ సంఘం మాజీ చైర్మన్ బుల్లెట్ సురేష్ తెలిపారు. చిత్తూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 13న ఉదయం 10 గంటలకు చిత్తూరు నగరం గంగినేని చెరువు ఒడ్డున చిన్నమరుదు, పెరియ మరుదు పాండియర్ సోదరుల విగ్రహాలను ఆవిష్కరించనున్నట్టు చెప్పారు. వీరు హిందూ దేవాలయాలతోపాటు మసీదులు, చర్చిల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులను కేటాయించి, వాటి నిర్వహణకు సైతం పలు గ్రామాలను దత్తత ఇచ్చి, ఆదాయాన్ని సమకూర్చడం మరుదు సోదరుల ఔన్నత్యానికి నిదర్శనమన్నారు. అంతటి మహోన్నత చరిత్ర కలిగిన మరుదు సోదరులు చరిత్ర పలువురికి స్ఫూర్తిదాయకం కావాలనే ఉద్దేశంతో విగ్రహాలను ఆవిష్కరించనున్నామని, దీనికి అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో చిత్తూరు మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, మొదలియార్ సంక్షేమ సంఘం నాయకులు షణ్ముగం, శేఖర్, సుందరం, బాలమురుగన్, దీపక్, ఎట్టేరి సంతోష్, బుల్లెట్ అప్పు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన



ఎరువుల కోసం ఆందోళన చేస్తున్న రైతులు

బంగారుపాళెం: స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయం వద్ద సోమవారం యూరియా కోసం రైతులు ఆందోళన చేశారు. పలువురు రైతులు యూరియా కోసం మండల కేంద్రం బంగారుపాళెంలోని వ్యవసాయ కార్యాయం వద్దకు వచ్చారు. వ్యవసాయాధికారులు 10.30 గంటలకు కార్యాలయం వద్దకు వచ్చారు. యూరియా స్టాకు లేదని చెప్పడంతో ఆగ్రహించిన రైతులు కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. మారు మాట్లాడుతూ, మండల కేంద్రానికి వచ్చిన యూరియా ఏమైందని అధికారులను ప్రశ్నించారు. ఎరువుల కొరత కారణంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ దుకాణాలలో ఎక్కువ ధరకు యూరియా విక్రయిస్తున్నారని, ప్రభుత్వం రైతు సేవా కేంద్రాలకు సక్రమంగా ఎరువులు సరఫరా చేయడం లేదని మండిపడ్డారు. ఈ పరిస్థితుల్లో వ్యయ ప్రయాసకోర్చి ఇతర ప్రాంతాల నుంచి ఎరువులు కొనుగోలు చేయాల్సిన దుస్థితి కలిగిందని నిరసించారు. గత ప్రభుత్వ పాలనలో రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేవని, కూటమి ప్రభుత్వ పాలనలో ఆ పరిస్థితులు లేవని, అధికారులు స్పందించి రైతులకు యూరియా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై సాక్షి వ్యవసాయాధికారిని ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్ కట్ చేశారు.

సమస్యలను జవాబుదారీతనంతో పరిష్కరించండి



బాధితుల సమస్యలు వింటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే సమస్యల్లో ఆర్థిక అంశాలతో ముడిపడని వినతులను తక్షణం పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. చిత్తూరులోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్)లో వచ్చిన ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో విచారణ చేసి, పరిష్కరించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పీజీఆర్‌ఎస్‌పై అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలన్నారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, ఏసీపీ నాగేంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలివ్వండి



మాట్లాడుతున్న పవన్

గుడిపాల: విద్యార్థులందరికీ జాతీయ నులి పురుగుల దినం రోజున నులిపురుగుల మాత్రలను మింగించాలని వైద్య ఆరోగ్యశాఖ స్టేట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పవన్ ఆదేశించారు. సోమవారం మండలంలోని నరహరిపేట హైస్కూల్, వసంతాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. వసంతాపురం అంగన్‌వాడీ సెంటర్‌లో ఎంతమంది పిల్లలు ఉన్నారో ఆరా తీశారు. వారందరికీ నులి పురుగుల నిర్మూలన మాత్రలు ఆల్బెండజోల్ వేసే బాధ్యత ఆశావర్కర్లు స్వీకరించాలన్నారు. పూర్తి మండలంలో 3,492 మంది పిల్లలకు ఈ మాత్రలను అందజేస్తామని వైద్య సిబ్బంది ఆయనకు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే మేనేజర్ స్వామిదాస్, డాక్టర్ సాయిగౌతమ్, వైద్య సిబ్బంది విజయ, చంద్రశేఖర్, ఉమా మహేశ్వరి, సుజిమ తదితరులు పాల్గొన్నారు.



ఐరాల: మాట్లాడుతున్న వైద్యాధికారి రెడ్డెప్ప

ఐరాలలో..

ఐరాల: పిల్లల్లో నులి పురుగులు నిర్మూలనకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప ఆదేశించారు. జాతీయ నులి పురుగుల దినం సందర్భంగా సోమవారం స్థానిక పీహెచ్‌సీలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లకు సమావేశం నిర్వహించి వైద్యాధికారి మాట్లాడారు. మండలంలోని 2,835 మంది పిల్లలకు 20వ తేదీ మధ్యాహ్నం భోజనం తర్వాత అల్బెండజోల్ మాత్రలు మింగించాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 44 అంగన్‌వాడీ కేంద్రాలు, 32 ప్రాథమిక పాఠశాలలు, 3 ఉన్నత పాఠశాలలకు సరిపడా మాత్రలు సరఫరా చేశామన్నారు. పిల్లలకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఆదిలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

18నుంచి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'



వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో పార్టీ కన్వీనర్ ప్రకాష్

గుడిపాల: మండలంలో ఈనెల 18వ తేదీ నుంచి బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ప్రకాష్ తెలిపారు. సోమవారం గుడిపాలలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల హామీలను నెరవేర్చకుండా ఏడాది పాలన పూర్తి చేసి ప్రజలను దగా చేశారని విమర్శించారు. ఈ విషయాన్ని ప్రజలకు చాటిచెప్పడానికే బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహణకు పూనుకుంటున్నట్టు చెప్పారు. 18 ఉదయం 10 గంటలకు నారగల్లు ఎంపీటీసీ సెగ్మెంట్, 11 గంటలకు 197 రామాపురం సెగ్మెంట్, సాయంత్రం 4గంటలకు మరకాల కుప్పం, 5 గంటలకు నంగమంగళంలో, 19వ తేదీ ఉదయం 10 గంటలకు పానాటూరు, 11గంటలకు గుడిపాల, సాయంత్రం 4గంటలకు పాపసముద్రం, 5గంటలకు చిత్తపార, 20న ఉదయం 10గంటలకు వసంతాపురం, 11గంటలకు బసవాపల్లె, సాయంత్రం 4గంటలకు 189 కొత్తపల్లె, 5 గంటలకు చీలాపల్లెలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వివరించారు. ఆయా సెగ్మెంట్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రజనీకాంత్, జనార్దన్, మధుసూదన్‌రెడ్డి, మధుసూదన్‌రాయల్, ప్రసాద్ రెడ్డి, బాబు, కృష్ణమూర్తి, దీనదయాల్, రవి, సంపత్, చిట్టిబాబు, ప్రవీణ్, రజని తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో హర్ ఘర్ తిరంగా ర్యాలీలు



తిరంగా మానవహారం నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

చిత్తూరు అర్బన్: భారత స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలోని ప్రధాన కూడళ్లలో హర్ ఘర్ తిరంగా, హర్ ఘర్ స్వచ్ఛతా ర్యాలీలు నిర్వహించారు. ప్రజారోగ్య విభాగానికి చెందిన పారిశుద్ధ్య కార్మికులు, వార్డు కార్యదర్శులు, మేస్త్రీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్ మాట్లాడుతూ, స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్వచ్ఛతా కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచడం కోసం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వచ్ఛతా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతలో భాగస్వాములు కావాలన్నారు. రోడ్లపై చెత్త వేయరాదని, ఇళ్లల్లోనే తడి, పొడి చెత్తను వేరు చేసి కార్మికులకు ఇవ్వాలని కోరారు.

● మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని..!





చిత్తూరు కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించి జైలు పాల్జేసిన రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని కోరుతూ చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి సోమవారం నగరంలోని దొడ్డిపల్లె సప్తకనికలమ్మ ఆలయంలో అభిషేకాలు, పూజలు చేశారు. ఆలయం వెలుపల టెంకాయలు కొట్టారు. ఉయ్ స్టాండ్ ఫర్ మిథున్‌రెడ్డి అంటూ పోస్టర్లు చేతబట్టి వారి సంఘీభావం తెలిపారు. మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, డిప్యూటీ మేయర్ మేయర్ చంద్రశేఖర్, చుడా మాజీ చైర్మన్ పురుషోత్తం రెడ్డి, మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాయత్రీదేవి పలువురు నాయకులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

నేడు రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

- ఐరాల: మండలంలోని వడ్రాంపల్లె, కొత్తపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఓ వరలక్ష్మి తెలిపారు. వడ్రాంపల్లెలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, కొత్తపల్లెలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో పంటల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పిస్తామన్నారు. రెండు గ్రామాల రైతులు పాల్గొనాలని కోరారు.

పాలక మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

బంగారుపాళెం: మండలంలో మొగిలిలోని శ్రీ స్వయంభు మొగిలీశ్వరస్వామి దేవాలయ ధర్మకర్త మండలి నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఈఓ మునిరాజ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు దేవాదాయశాఖ నిబంధనల మేరకు పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 26వ తేది లోపు చిత్తూరు సహాయ కమిషనర్ కార్యాలయంలో అందజేయాలని, ధర్మకర్తల మండలి దరఖాస్తు ఫారాలు అవసరమైన వారు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

భూ రీసర్వే పూర్తిచేయండి

యాదమరి: మండలంలో మూడవ దశ భూముల రీసర్వేను త్వరితగతిన పూర్తిచేయాలని తహసీల్దార్ పార్థసారథి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ఆయన సర్వేయర్లు, వీఆర్‌ఓలతో సమావేశమై మాట్లాడారు. రీసర్వేలో భాగంగా మూడవ దశలో యాదమరి, మాదిరెడ్డిపల్లె, కుక్కలపల్లె, దాసరాపల్లెలో ఈ నెల 20వ తేదీ లోపు పూర్తిచేయాలన్నారు. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా భూయజమానుల సమక్షంలో సర్వే చేయాలన్నారు. అర్జీదారుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు తన దృష్టికి, అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇదలా ఉంచితే, సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 15 ఫిర్యాదులు అందాయని, ఎక్కువగా భూసమస్యలు, రీసర్వేలపై సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరారని తహసీల్దార్ చెప్పారు.

ఎల్‌ఆర్‌ఎస్ సద్వినియోగం చేసుకోండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కమిషనర్, అధికారులు

చిత్తూరు అర్బన్: లేఔట్ క్రమబద్ధీకరణ పథకాన్ని (ఎల్‌ఆర్‌ఎస్) అర్హత ఉన్న వాళ్లు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ కోరారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ కరపత్రాలను విడుదల చేసి ఆయన మాట్లాడారు. అనుమతులు పొందకుండా వేసిన లేఔట్లలో స్థలాన్ని క్రమబద్ధీకరించుకోవడానికి ఇదో మంచి అవకాశమన్నారు. చిత్తూరులో 30కు పైగా లేఔట్లకు అనుమతల్లేవని, ప్రజలు కార్పొరేషన్ కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో అధికారులను సంప్రదించి క్రమబద్ధీకరణ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు వెంకటరామిరెడ్డి, లోకేష్, నాగేంద్ర, వర్మ పాల్గొన్నారు.

చిత్తూరులో విద్యార్థి అదృశ్యం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన విద్యార్థిని (23) కనిపించడం లేదని ఆమె కుటుంబ సభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య కథనం మేరకు.. కుప్పంలోని ఓ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న యువతి వారం క్రితం ఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి జైలు

చిత్తూరు అర్బన్: మహిళను కులం పేరిట దూషించి, దాడి చేసిన కేసులో ఏడాది జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ చిత్తూరులోని మొదటి అదనపు జిల్లా సెషన్స్ న్యాయస్థానం సోమవారం తీర్పునిచ్చింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.చంద్రశేఖర్ కథనం మేరకు.. బంగారుపాళ్యం మండలం గౌరీశంకరాపురానికి చెందిన మహిళ 2017 మార్చిలో వీధి కొళాయి వద్ద నీళ్లు పట్టుకోవడానికి వచ్చారు. ఆ సమయంలో ఇక్కడకు వచ్చిన సురేష్ నాయుడు ఆ మహిళతో గొడవ పడ్డాడు. ఆపై మహిళను కులం పేరిట దూషించి, దాడి చేశాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. నేరం రుజువుకావడంతో సురేష్‌నాయుడుకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి రమేష్ తీర్పునిచ్చారు.

